

రైతులకు వాయు'గండం'

- 24 నుంచి 29 వరకూ వర్షాలు పడే అవకాశం
- మొంథా తుఫాన్‌తో 20 శాతం నష్టపోయిన రైతులు
- పంట చేతికొచ్చేసరికి మరో గండం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా రైతాంగాన్ని మరో తుఫాన్ వెంటాడుతోంది. గత నెలలో మొంథా తుఫాన్‌తో కుదేలైన రైతాంగం నెమ్మదిగా కోలుకుని, పంటను దక్కించుకునే ప్రయత్నంలో ఉన్న సమయంలో మరో తుఫాన్ ముంచుకొస్తోంది. సెన్‌యార్ తుఫాన్ ప్రభావం వల్ల ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకూ ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరిక కేంద్రాల సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులకు పలు సూచనలు చేస్తోంది. తుఫాన్ ప్ర భావం ఉంటే మాత్రం రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తుఫాన్ సమాచారం తెలుసుకోవడంతోపాటు పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో 76,941 హెక్టార్లలో వరి సాగు చేశారు. దీని ద్వారా సుమారు 5 లక్షల 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇందులో ఇంత వరకూ 29,273.78 హెక్టార్లలో మాసూళ్లు పూర్తయ్యాయి. సుమారు లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. అందులో సుమారు లక్ష టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇంకా 75 వేల టన్నుల ధాన్యం బయట ఉంటుంది. ఈలోపుగా ఈ ధాన్యం అంతా కొనుగోలు చేస్తే చాలావరకూ సమస్య తగ్గుతుంది. చాలామంది రైతులు ధాన్యం తేమ శాతం తగ్గించుకోవడం కోసం రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లోనూ, పొలాల్లోనూ ఎండ బెడుతున్నారు. వారంతా వెంటనే ఆ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం మంచిది. మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో 25 వేల హెక్టార్లలో వరి పంట నష్టపోయింది. దాని విలువ రూ.36 కోట్లు. మినప కూడా దెబ్బతింది. దాని నష్టం రూ.1.7కోట్లు. ఉద్యావన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పంట ఉంది. కడియం, ఉండ్రాజవరం మండలాల్లో కోతలు మొదలు కాలేదు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు ఎక్కువగా ఉంటే తగ్గేవరకూ కోతలు ఆపాలని కోరారు. కోసిన పంటను, ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచాలని పేర్కొన్నారు.



కార్తీకం పరిసమాప్తం

కార్తీక మాసం ముగింపు రోజు పోలిస్వర్గం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నదిలో మహిళలు స్నానాలు చేసి దీపాలు పెడుతున్న దృశ్యం. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



మళ్లీ గుంతలు

మొంథా తుఫాన్‌తో రహదారులకు తూట్లు

తాళ్లపూడి మండలంలోని పైడిమెట్ట వద్ద రహదారి పరిస్థితి (ఫైల్)

- వాహనాల గంతులు
- జనాల ఒళ్లు హూనం
- అన్ని రోడ్ల దుస్థితీ ఇదే







బిక్కవోలు వద్ద కెనాల్ రోడ్డు దుస్థితి.. రాజానగరం-కలవచర్ల రోడ్డు.. కాతేరు-సీతానగరం రోడ్డు దుస్థితి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రోడ్లు గుంతలు... వాహనాలు గంతులు చందంగా జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు చెందిన రోడ్ల పరిస్థితి ఉంది. ఈ రోడ్ల మీద ప్రయాణించేవారి ఒళ్లు హూనం అయిపోతోంది. అనేక రోడ్లకు రిపేర్లు చేసినా అవి మళ్లీ గుంతలు పడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సంకాంత్రి ముందు గుంతలు పూడ్చింది. కానీ మొంథా తుఫాన్ వల్ల మళ్లీ గోతులు పడ్డాయి. జిల్లాలో 87.99 కిలోమీటర్ల ఉన్న 48 ఆర్‌అండ్‌బీ స్టేట్ హైవే రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక పంచాయతీరాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. ఇది అధికారుల లెక్క. ఇవికాకుండా అనేక పంచాయతీల పరిధిలో అనేక లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 60 పంచాయతీరాజ్ రోడ్లు గుంతలమయం అయ్యాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజానగరం నుంచి పెద్దపర్తిరేవు రోడ్డు 9.2 కిలోమీటర్ల మేర, సోమేశ్వరం నుంచి రాజానగరం రోడ్డు 8 కిలోమీటర్ల మేర దెబ్బతింది. రాజమహేంద్రవరం పుణ్యక్షేత్రం మీదుగా కేశవరం రోడ్డు 0.6 కిలోమీటర్ల, కడియపులంక, వెదురుమూడిరోడ్డు మూడు ప్రాంతాల్లో 5.9 కిలోమీటర్లు, మండపేట నుంచి దుళ్ల రోడ్డు 1.2 కిలోమీటర్లు, కడియం నుంచి రాజమండ్రి రోడ్డు 54. కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. బుచ్చింపేట నుంచి గాదరాడ రోడ్డు 4 కిలోమీటర్లు, రాజమండ్రి నుంచి మల్లవరం మీదుగా గోకవరం రోడ్డు 4 కిలోమీటర్లు, దివాన్‌చెరువు నుంచి పుణ్యక్షుత్రం రోడ్డు 3 కిలోమీటర్ల మేర, జీఎన్‌టీ నుంచి జెడ్.మేడపాడు రోడ్లు 4 కిలోమీటర్ల దెబ్బతిన్నాయి. కోరుకొండ నుంచి నాగంపల్లి రోడ్డు 4.4 కిలోమీటర్లు, విజయవాడ -విశాఖపట్నం రోడ్డు 0.5 కిలోమీటర్లు, పందలపాక నుంచి అరికిరేవులరోడ్డు, శ్రీరంగపట్నం నుంచి నలగొండ రోడ్డు, రాజమండ్రి నుంచి కనుపూరు మీదుగా గోకవరం రోడ్డు, వెంకటనగరం నుంచి ఎన్‌హెచ్ 5 రోడ్డు, ఎన్‌హెచ్ 5 నుంచి పాతబొమ్మూరు మీదుగా పోలీసు క్వార్టర్స్ రోడ్డు, బైపాస్‌రోడ్డు దెబ్బతిన్నాయి. ఇక పంచాయతీరాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. వీటివల్ల రూ45.81 కోట్లు నష్టం జరిగింది. అన్ని మండలాల పరిధిలోను దెబ్బతిన్నాయి. చాలా గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు పెద్దపెద్ద గోతులుగా మారాయి. అనపర్తిలో దొంతమూరు బీటీ రోడ్డు నుంచి నల్లమిల్లి రోడ్డు, ఏడీబీ రోడ్డు నుంచి వడిశలేరు, బిక్కవోలు నుంచి బలభద్రపురం, బలభద్రపురం నుంచి కానేడు మీదుగా నల్లమిల్లి, ఆర్‌అండ్‌బీ నుంచి తుమ్మలపల్లి, ఇల్లపల్లి మీదుగా రంగాపురం, కొండుకుదురు వి.సావరం, కుతుకులూరు నుంచి పులగుర్త, ఎల్‌ఎన్ పురం నుంచి మహేంద్రవాడ రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎల్‌ఎన్‌పురం, అనపర్తి నుంచి ద్వారపూడి ఐఎల్ టీడీ పుంతరోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. రంగంపేట మండలంలో ముకుందవరం నుంచి ఏడీబీ రోడ్డు, సుభద్రమ్మపేట నుంచి ముకుందవరం, ఆర్ఎస్ రోడ్డు నుంచి వడిశలేరు, ఈస్ట్ గోనగూడెం రోడ్డు పాడయ్యాయి. శ్రీరామపురం నుంచి శ్రీకృష్ణపట్నం వెళ్లే దారిలో ఒకచోట ఎప్పుడూ గోతులే. రఘునాథపురం రోడ్డును పట్టించుకునే నాధుడే లేడు. పిడింగొయ్య, రఘునాథం చెరువు వద్ద పెద్ద గొయ్యి ఎప్పుడూ పడుతూనే ఉంటుంది. ఇలా అనేక గ్రామాల్లో రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. కడియం మండలంలో ఎన్‌హెచ్ 16 నుంచి బుర్రిలంక వేంకటేశ్వర టెంపుల్ రోడ్డు, వీరవరం నుంచి కడియపులంక రోడ్డు, వీరవరం నుంచి మురమండరోడ్డు, నందెనపుంత రోడ్డు, దామిరెడ్డిపల్లి నుంచి మురమండ రోడ్డు, కేవీ రోడ్డు నుంచి దామిరెడ్డిపల్లి రోడ్డు, మాధవరాయుడుపాలెం రోడ్డు నుంచి జేగురుపాడు రోడ్డు, గుబ్బలవారిపాలెం రోడ్డు, మురమండ నుంచి దుళ్ల రోడ్డు, జేగురుపాడు నుంచి మురమండ రోడ్డు, కేవీ నుంచి కేవీ రోడ్డు దామిరెడ్డిపాలెం రోడ్డు, మురమండలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జెడ్పీ రోడ్డు వయా వెటర్నరీ ఆసుపత్రి రోడ్డు దారుణంగా ఉన్నాయి. కడియం నుంచి బుర్రిలంక రోడ్డు, రాజమండ్రి రూరల్‌లో తొర్రేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వెంకటనగరం రోడ్డు, పిడింగొయ్య పరిధిలోని కవలగొయ్య ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి బుచ్చియ్యనగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పాడయ్యాయి. గోపాలపురంలో పీజే రోడ్డు నుంచి గోపాలపురం, సాగిపాడు రోడ్డు, పీజే రోడ్డు నుంచి కోమటిగుంట, నల్లజర్ల మండలంలో చోడవరం నుంచి గుండేపల్లి, దేవరపల్లి నుంచి అచ్చయ్యపాలెం, దేవరపల్లి మండలంలో చిన్నాయిగూడెం నుంచి కుంతలగూడెం, వైకె రోడ్డు నుంచి గాంధీనగర్ రహదారి అధ్వానంగా మారాయి.



నగదు రహితమే లక్ష్యంగా..

జాతీయ, రాష్ట్ర రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద టోల్‌ఫీ చెల్లింపులన్నీ నగదు రహితంగా సాగాలన్న లక్ష్యంతో సమూల మార్పులు చేస్తున్నారు. టోల్‌ఫీ చెల్లింపులు ఫాస్టాగ్ ద్వారానే జరిగేలా ప్రోత్సహిస్తూనే నగదు చెల్లిస్తే రెట్టింపు చార్జీలు చెల్లించే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందని నేషనల్ హైవే అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వార్షిక పాస్‌లను అమల్లోకి తెచ్చింది.



- టోల్‌ప్లాజాల వద్ద టోల్‌చార్జీల చెల్లింపులో మార్పులు
- ఫాస్టాగ్ ఉంటే సాధారణ చార్జీలే
- నగదు చెల్లిస్తే 100 శాతం అదనం
- యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతమే అదనం
- ఇప్పటికే అమల్లోకి వార్షిక పాస్‌లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఈతతోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్యగల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్నాయి. దీంతోపాటు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద, నల్లజర్ల మండలం వీరవల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ అధీనంలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్నిరకాల కార్లు, వ్యాన్లు, ఫోర్‌వీలర్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.

ఫాస్టాగ్ లేకుంటే 100 శాతం అదనం

టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుం కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ ఖాతాలో సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుంకంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. నగదు చెల్లింపులు చేసేవారికి 24 గంటల వ్యవధిలో రాకపోకలు పూర్తిచేసి టోల్‌ను దాటితే టోల్‌ఫీజు చెల్లింపులో ఉన్న రాయితీలు వర్తించవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది.

యూపీఐ ద్వారా చెల్లిస్తే..

ఫాస్టాగ్‌లో నగదు లేకున్నా, అసలు వాహనానికి ఫాస్టాగ్ లేకున్నా ఇప్పటివరకూ వాహనదారులు నగదు రూపంలోనే 100శాతం అదనంగా టోల్‌గేటుల వద్ద ఫీజులు చెల్లించాల్సి వచ్చేది. ఈ విధానంలో మార్పులు తెస్తూ కేంద్రం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నేషనల్ హైవే అథారిటీ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే టోల్‌ఫీజుకు అదనంగా 25 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని నవంబరు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. నగదు చెల్లిస్తే మాత్రం 100శాతం బాదుడును వాహనదారులు భరించాల్సి ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి టోల్‌గేటుల వద్ద ఫీజుల చెల్లింపులు నగదు రూపంలో జరగకూడదనేది కేంద్రం లక్ష్యమని హైవే అథారిటీ అధికారి ఒకరు తెలిపారు.

వార్షిక పాస్‌లకు ఆదరణ

ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించేలా కేంద్రం తీసుకువచ్చిన నూతన విధానానికి వాహనదారులు నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కోసం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫాస్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై గల ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200సార్లు ఏదిముందైతే దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. కార్లు, జీపులు, వ్యాన్‌లు వంటి వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌ను వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లోని టోల్‌గేట్‌ల వద్ద మాత్రం సాధారణ పద్ధతిలో ఫాస్టాగ్ ద్వారా టోల్‌ఫీ చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్ లేనివారు చాలావరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.



ధవళేశ్వరం గోదావరిలో చేప పిల్లలను నదిలో విడిచిపెడుతున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

గోదావరిలో చేప, రొయ్య పిల్లలను విడుదలచేసిన కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల


ధవళేశ్వరం,నవంబరు21(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు అందిపుచ్చుకుని మత్స్యకారులు మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ చేకూరి కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం స్థానిక కంచర్ల లైన్ రేవు వద్ద గోదావరిలోకి 50 లక్షల చేప పిల్లలు, 5 లక్షల రొయ్య సీడ్‌ను విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మలాకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారవర్గాల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లా పరిధిలో గుర్తింపు పొందిన సుమారు 4 వేల మంది మత్స్యకారులు వేటవృత్తిలో ఉన్నారని, అనేక మంది గుర్తింపు లేకుండానే వేట వృత్తిలోనే కొనసాగుతున్నారని తెలిపారు. అటువంటి వారి కుటుంబాల రిజిస్ట్రేషన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గోదావరిలో వేటపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారులకు జీవనోపాధి పెంపొందించే విధంగా గోదావరిలో మత్స్య సంపద పెరిగేటట్లు ఏటా చేప పిల్లలను వదులుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే గోదావరిలోకి చేప, రొయ్య పిల్లలను విడుదల చేశారు. ఆర్డీవో కృష్ణనాయక్, మత్స్యశాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్టార్టప్స్ నుంచి పరిశ్రమల దిశగా ఆర్‌టీహెచ్'



నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్రతినిధులతో మాట్లాడి వారి ఆలోచనలపై చర్చించి ప్రారంభ దశలో ఉన్న పలు ఉత్పత్తులు, ఇన్నోవేషన్ నమూనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘస్వరూప్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు యువ స్టార్టప్‌లకు విలువ జోడింపు ఆధారంగా కొత్త అవకాశాలు లభించేలా ఆర్‌టీహెచ్ బలమైన వేదికగా మారాలని తెలిపారు. కడియం నర్సరీ పూల వ్యర్థాలను సమర్థవంతంగా వంద శాతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. బయోగ్యాస్ ఉత్పాదికత సాకారం అయ్యేలా ఆర్ఎంసీ కమిషనర్‌తో కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేయాలని ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో పలు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభోత్సవంలో శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ తదితరులు

'గ్రీన్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన పర్యావరణ మార్పు'

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బయో ఆధారిత ఆవిష్కరణలు, గ్రీన్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన పర్యావరణ మార్పునకు పరిశోధకులతో కూడిన సదస్సులు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. తొలిరోజున శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఆర్ ప్రసాద్, ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ ఆర్‌కే ప్రసాద్ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఇప్పటివరకూ జరిగిన ఆవిష్కరణలను వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్ కూడా నిర్వహించారు.



ఏజెన్సీలో ఎర్ర బియ్యం

'తూర్పు' మన్యంలో రెడ్ రైస్ సాగుకు శ్రీకారం

(కూనవరం-ఆంధ్రజ్యోతి)

ఎర్ర బియ్యం... దీనిని ఇప్పటివరకు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే పండించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేవలం 600 మంది రైతులు ఈ పంటను పండిస్తున్నారు. ఇప్పుడు దీనిని ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి జిల్లా కూనవరంలోనూ సాగు చేస్తున్నారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన రైతు గోళ్ల సత్యనారాయణ ఎర్ర బియ్యం సాగుకు శ్రీకారం చుట్టాడు. విత్తనాలను ఆన్‌లైన్‌లో తెప్పించిన ఈయన తన పొలంలో నాటాడు. సాధారణ వరి రకాలు దిగుబడి 120 రోజుల్లో వస్తే ఈ పంటకు 135 రోజులు పడుతుంది. తెల్ల బియ్యం కంటే ఎర్ర బియ్యంలో పౌష్టికాహార గుణాలు ఎక్కువ. విటమిన్ బీ1, బీ2, బీ6లతో పాటు మాంగనీస్, కాల్షియం, సోడియం, జింక్, ఐరన్ లాంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్ కణాలను తగ్గించడంలో ఈ ఎర్ర బియ్యం ఎంతో దోహదపడతాయి. మధుమేహాన్ని నివారించడంలోను, బీపీ తగ్గించగల సామర్థ్యం కూడా ఎర్ర బియ్యంలో ఉన్నాయి. ఇన్ని పోషకాహారాలు ఉన్న ఈ పంటను ప్రస్తుతం ఒక ఎకరం భూమిలో సాగు చేస్తున్నానని, హెక్టారుకు ఆరు టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పాడు.


కంకుల దశలో ఉన్న పంట


రెడ్ రైస్ పంటను పరిశీలిస్తున్న రైతు సత్యనారాయణ



చిన్నారులను దత్తత తీసుకోవాలని.... వారితో అమ్మ, నాన్న అని పిలిపించుకోవాలని చాలా మంది ఆరాటపడతారు. పిల్లలను పెంచుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఆస్తులున్నా.. సంతాన భాగ్యం లేక ఆవేదనతో ఉండే వారు సమాజంలో మరికొందరు ఉంటారు. పిల్లలను పెంచుకోవాలని ఉన్నవారు కొందరు దళారులను ఆశ్రయిస్తుంటారు.

అనాథలుగా మారిన పిల్లలు కూడా సమాజంలో కనిపిస్తుంటారు. పిల్లలను కని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయే మానవత్వం లేని తల్లిదండ్రులు అక్కడక్కడా ఉంటారు. రోజుల వ్యవధిలో ఉన్న చిన్నారులను సైతం రోడ్డుపై వదిలేస్తుంటారు. అలాంటి వారిని చేరదీసి శిశుగృహ సంరక్షణలో ఉంచుతారు శిశుగృహ అధికారులు. వారిని చట్టబద్ధంగా దత్తత ఇస్తూ.. వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.

దత్తతకు వేళాయె

- అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న మహిళ-శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో 'శిశుగృహ'ల నిర్వహణ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ చట్టబద్ధంగా తీసుకోవడం ఒక వరం. అలాంటి చట్టబద్ధత దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను బాలల పరిరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నాయి. దత్తతలో ఉండే వివిధ రకాలైన వెసులుబాట్లు రిలేటివ్ అడాప్షన్ (రక్త సంబంధీకుల దత్తత), స్టెప్ పేరెంటెడ్ ఆప్షన్ తదితర అంశాలపై బాలల పరిరక్షణ సిబ్బంది అవగాహన కల్పించనున్నారు. నవంబరు మాసం అంతా గ్రామ, మండల, డివిజనల్ స్థాయిల్లో దత్తత ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఎలా దత్తత తీసుకోవచ్చంటే...

మొదటి దశ: ముందుగా పాన్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బిడ్డను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తమ పాన్ కార్డుతో కారా (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఏఆర్ఏ.ఎన్ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రసీదు ప్రింటు తీసుకోవాలి.

రెండో దశ:
(ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయడం)
- ఫ్యామిలీ ఫొటో (2 ఇంటు 3),
- నివాస ధ్రువీకరణ పత్రం: ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు, పాస్‌పోర్టు, కరెంట్ బిల్లు
- ఆదాయ ధ్రువీకరణ పత్రం: సంవత్సర ఆదాయపత్రం, తహసీల్దారు నుంచి ధ్రువీకరణ.
- వివాహ ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి తీసుకురావాలి.
- దత్తత తీసుకోబోయే వారి జనన ధ్రువీకరణ పత్రాలు/నోటరీ నుంచి పుట్టిన తేదీ అఫిడవిట్
- తల్లిదండ్రులు ఇద్దరి మెడికల్ టెస్టులు విడివిడిగా ఇవ్వాలి. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి.

మూడో దశ:
హోమ్ స్టడీ (గృహ అభ్యసన రిపోర్ట్)

హోమ్ స్టడీ సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో ఏదైనా జాతీయ బ్యాంకులో రూ.6వేలు డీడీ తీసి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి దరఖాస్తు సమర్పించాలి.

చివరి దశ:
(దత్తత తీసుకోవడం)
- బిడ్డను దత్తత తీసుకునే సంస్థ వారికి రూ.50వేలు డీడీ రూపంలో అందించాలి.
- దత్తత నిర్ధారణ కోసం జిల్లా ఫ్యామిలీ కోర్టుకు బిడ్డను దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కలిసి హాజరుకావాలి. బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం దత్తత తీసుకున్న జిల్లా మున్సిపల్ కార్యాలయం ద్వారా తల్లిదండ్రులకు అందజేస్తారు. దత్తత తీసుకున్న తర్వాత ఆరు నెలలకు ఒకసారి, రెండు సంవత్సరాల పాటు గృహ విచారణ సమయంలో రూ.2వేలు డీడీ రూపంలో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి సమర్పించాలి.
- చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకున్న వారికి మూడు నుంచి ఏడు సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా.... ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉంది.

కాకినాడ జిల్లాలో 2010 నుంచి ఇప్పటివరకు సుమారు 87 మంది చిన్నారులను దత్తత ఇచ్చినట్టు శిశుగృహ ఇన్‌చార్జి మేనేజరు లక్ష్మీరేవతి తెలిపారు. వీరిలో 14 మంది చిన్నారులను ఇతర దేశాల దంపతులకు దత్తత ఇచ్చినట్టు ఆమె 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇంకా నలుగురు చిన్నారులు శిశుగృహ మందిరంలో సంరక్షణ పొందుతున్నారు.



చిన్నారుల దత్తతపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్న కాకినాడ జిల్లా ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కాకినాడ కరణం గారి సెంటర్లో నిర్వహిస్తున్న శిశుగృహ

దత్తత కావాల్సి వస్తే...

దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కావాలంటే దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కానీ, ఐసీడీఎస్ అధికారులను కానీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, రూమ్ నెం: 201, మోర్ సూపర్‌మార్కెట్‌పైన రెండో అంతస్తు, కరణంగారి సెంటర్, కాకినాడలో సంప్రదించవచ్చు. ప్రాజెక్టు డైరెక్టర్ మొబైల్: 8639140672, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మొబైల్: 8555060818, శిశుగృహ మేనేజరు మొబైల్ :8919123488 సంప్రదించాలి.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమాచారం కోసం సంప్రదించాల్సిన చిరునామా... స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ డోర్ నెం: 12-2-247/ ఎంజీ 27, ప్లాట్ నంబర్ 01, ఏపీహెచ్‌బీ కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో, ఎర్రవంతెన దగ్గర, అమలాపురం. మొబైల్: 9640852688

తూర్పుగోదావరి జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమాచారం కోసం రాజమహేంద్రవరంలోని ఆర్టీవో ఆఫీసు ఎదురుగా ఉన్న శిశుగృహ మందిరంలో సంప్రదించవచ్చు. 8328544610 నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఒక బాలుడు మాత్రమే దత్తతకు సిద్ధంగా ఉన్నాడు. దృష్టిలోపం సమస్యతో ఉన్న అతడికి త్వరలోనే ఆపరేషన్ చేయించి, ఆ తర్వాత దత్తత ప్రక్రియ చేపడతామని శిశుగృహ ఇన్‌చార్జి చెప్పారు.

వాడపల్లి వెంకన్న కార్తీకం ఆదాయం రూ.5.51 కోట్లు


ఆలయానికి పోటెత్తిన భక్తులు (ఫైల్)

ఆత్రేయపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామికి కార్తీక మాసం నెల రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ ఏడాది వివిధ సేవల ద్వారా రూ.5,51,55,734 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. గత ఏడాది రూ.4,75,63,429 ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.75,92,305 అధిక ఆదాయం వచ్చిందన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మెరుగైన ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 7,170 మంది దరఖాస్తు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికిఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 7170 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 13న మొత్తం 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను navodaya.gov.in, cbseitms.nic.in సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవలసి ఉంటుందని, హాల్ టికెట్ డౌన్లోడ్ చేసే సమయంలో అభ్యర్థి రిజిస్ట్రేషన్ నెంబర్‌ను యూజర్ ఐడీ గాను, అభ్యర్థి పుట్టిన తేదీని పాస్వర్డ్ గాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పులిహోరతో వేంకటేశ్వరస్వామి


పులిహోరతో తీర్చిదిద్దిన స్వామివారి రూపం

ధవళేశ్వరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ సందర్భంగా శుక్రవారం పులిహోర, పువ్వులతో స్వామి రూపాన్ని రూపొందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

- ఝుటాఝూట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్న, వినయ్ విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వర స్వామికి వెండి ఝుటాఝూటం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష అలంకరణ చేయగా భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల్లో అరటి డొప్పల్లో నేతి దీపాలు వదిలి కార్తీక మాసానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ నేతలు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యులు చీమలకొండ ప్రసాద్, కొండపల్లి సత్య వాణి, కంచర్ల సుష్మామోహిని, గూనపాటి బుల్లెమ్మ భక్తులకు సేవలందించారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సామర్లకోటకు చెందిన మిరియాల కుటుంబీకుల వీరభద్రుని సంబరం, మహిళా భక్త సమాజంచే కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.


వెండి ఝుటాఝూట అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి

ఫార్మా ఫ్యూజన్-2కే 25 ప్రారంభం

- జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- జ్యోతి ప్రజ్వలన చేసిన వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కృష్ణమోహన్

జేఎన్‌టీయూకే (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు వేదికగా ఫార్మా ఫ్యూజన్ 2 కే 25 నిలుస్తుందని జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్-ఐఎస్‌టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఫార్మా ఫ్యూజన్-2కే 25ను శుక్రవారం వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ డీ. కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిభ, విజ్ఞానం, పరిశోధనాభావం, సృజనాత్మకతకు పదునుపెట్టే విధంగా వినూత్నంగా ఆలోచించి ముందుకు సాగాలని కోరారు. పలు అంశాలపై ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. మైసూర్ జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొ-ఛాన్సలర్, మాజీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ బి.సురేష్ వర్చువల్‌గా పాల్గొని ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధస్సు పాత్రపై విలువైన ప్రసంగం చేశారు. ఫార్మా పరిశోధన, ఔషధ ఆవిష్కరణ, క్లినికల్ డేటా విశ్లేషన, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు మార్గదర్శక మార్పులు తీసుకువస్తుందని వివరించారు. ఏయూ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ ప్రిన్సిపాల్ జి.గిరిజాశంకర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డి. నాగమణి, ఐఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.భవానీ పాల్గొని తగిన సూచనలు చేసి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివిధ ఫార్మా, ఇన్నోవేటివ్ స్టాల్స్‌ని ప్రదర్శించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజైన శనివారం లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ నిపుణుడు డాక్టర్ వై.మోహన్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని విద్యా ర్థులతో తమ అనుభవాలను పంచుకుంటార న్నారు. ప్రదర్శించిన పలు అంశాలను పరిశీలిస్తారని కార్యక్రమ నిర్వాహకులు చెప్పారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిఖిల్ ఎంపిక

దివాన్‌చెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థి కోట నిఖిల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు రాజానగరం మండలం పాతతుంగపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కమలదాస్ శుక్రవారం తెలిపారు. పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు పార్థసారధి మాట్లాడుతూ కాకినాడలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో నిఖిల్ పాల్గొని ప్రతిభ కనబరిచాడన్నారు. విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.. ఈ నెల 23వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన నిఖిల్‌తో పాతతుంగపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, తదితరులు

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన యువకులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, పేవింగ్ స్టోన్ వర్కర్స్, రోడ్డు వర్కర్ వంటి వృత్తుల్లో నైపుణ్యం ఉన్నవారికి ఉపాధి కల్పించేందుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ అర్హతతో పాటు కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలని, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలు మాత్రమేనని చెప్పారు. జర్మనీలో నెలకు సుమారు రూ.2.57 లక్షల జీతంలో ఎనిమిది నెలల కాంట్రాక్ట్ పై నియామకాలు జరగనున్నాయి. వసతి, వీసా, ఫ్లైట్ చార్జీలు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు ఎంప్లాయర్ భర్తిస్తారని పేర్కొన్నారు. అయితే భోజనం, ట్రాన్స్పోర్టేషన్ ఖర్చులు అభ్యర్థులే చూసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు చెల్లించవలసిన ప్రాసెసింగ్ ఫీజు రూ.2 లక్షలు, జీఎస్టీ కలిపి, రెండు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పాస్ పోర్ట్, రిలీవింగ్ లెటర్, విద్యా సర్టిఫికెట్లు తప్పనిసరి అని సూచించారు. ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే https: //naipunyam.ap.gov.in/user-registration?page=program-registration నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 9966291339, 8500885866 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని గోపీకృష్ణ సూచించారు.

రేపు అనపర్తిలో మెగా జాబ్‌మేళా

- వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు. ఈ నెల 29న కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. గత పది రోజులుగా నిర్వహించిన జాబ్‌మేళాల్లో 250 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి తమిళనాడు ఓసూర్‌లో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు లభించాయన్నారు. నెలకు రూ.19 వేలు జీతంతో పాటు వసతి, భోజనం సౌకర్యాలను టాటా సంస్థ కల్పించిందన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాల అధికారులుగా పంచాయతీ కార్యదర్శుల నియామకం... ఉత్తర్వులు జారీ

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల జాతర ప్రారంభమైంది. ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించింది. తాజాగా ప్రభుత్వం సీనియర్ సహాయకులకు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగానూ, గ్రామ సచివాలయాల అధికారులుగాను పదోన్నతులు కల్పించింది. జోన్-2 పరిధిలోని 159 మంది తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ అంబేడ్కర్ జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాలకు చెంది పంచాయతీలలో గ్రేడ్-1 కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించింది. వీరిలో కొందరిని కాకినాడ జిల్లాకు కేటాయించగా మరి కొందరిని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఏఎస్ఆర్ జిల్లాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేసారు. వీరు ఆయా మండలాల పరిధిలో గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారులుగా నియామకం కానున్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులుగా 3టైర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 660 మందికి పదోన్నతులు లభించగా జోన్-2 పరిధిలో 159 మందికి పదోన్నతులు లభించాయి. సామర్లకోట మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొర్ల బుల్లియ్యకాపును ఏఎస్ఆర్ జిల్లా గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే వీకెరాయపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వై. శ్రీహరిని కాకినాడ జిల్లాలోనే గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే కాకినాడ జిల్లాకు వీజేవీ రమణ, ఎస్.శ్రీనివాసులు, సీహెచ్ వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లాకు కెవీఎం. నారాయణరావు, పీహెచ్ ఎస్ఎస్ఎన్. రాజు, కెవీఎం.నారాయణరావు, కె. శ్రీనివాసు, జీ. ఉషారాణి, బొర్రు శిరీష, జలాల్ మహ్మద్, ఎండీవీ.రమణారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, పినిశెట్టి వీరభద్రరావు, సావలం చినవెం కమ్మ, సీహెచ్ బాలబ్రహ్మజీ, డి.శశికుమార్, సామర్లకోట ఈటీసీలో పనిచేస్తున్న తుమ్మల ఎల్ఎన్ కుమార్‌రాజా, సత్తి శ్రీనివాస రెడ్డి తదితరులు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

శివోహం

కార్తీకమాసం ముగిసింది. నెలంతా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించిన భక్తులు చివరిరోజు అంతే భక్తిని కనబరిచారు. దీంతో శైవక్షేత్రాలన్ని శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం పోలిస్వర్గం(పోలిపాడ్యమి) సందర్భంగా శివోహం అంటూ ఆవు నెయ్యితో అరటిదొప్పల్లో వెలిగించిన దీపాలను గోదావరి, చెరువులు, కాలువలు, కోనేరుల్లో వదిలారు.



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు





రాజమహేంద్రరం పుష్కర్‌ఘాట్‌లో సూర్యుడికి నమస్కరిస్తున్న మహిళలు





దీపాల వెలుగులో పిఠాపురం పాదగయ పుష్కరిణి



పుష్కర్‌ఘాట్‌లో భక్తితో నమస్కరిస్తున్న బాలుడు..



రాజమహేంద్రరం పుష్కర్‌ఘాట్‌లో దీపాలు వదులుతున్న భక్తులు



సాదాసీదాగా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం సాదాసీదాగా సాగింది. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం 1,2,4,7 స్థాయి సంఘాల సమావేశాలు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వస్థాయి సంఘ సమావేశం, జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వస్థాయి సంఘ సమావేశం జరిగాయి. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. మందుగా జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ఉమ్మడి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. అనపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా పరిషత్‌కు చెందిన కొంతస్థలం కేటాయిస్తే తాగునీటి ప్రాజెక్టు కల్పించగమని, అందువల్ల వాటర్ గ్రిడ్‌లకు ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట సెంటర్ నుంచి సర్పవరం మీదుగా ఉప్పుటేరు వరకు ఆక్రమణలకు గురైన పంట కాలువను పునరుద్ధరిస్తే కాకినాడను ముంపు బారి నుంచి కాపాడవచ్చన్నారు. రాజానగరం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించారు. ఆయాస్థాయి సంఘాల సమావేశాల్లో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి అంశాలపై ఇప్పటి వరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

గోగన్నమఠంలో పడవ పోటీలు

ఉత్సాహంగా పాల్గొన్న మత్స్యకార యువకులు



గోగన్నమఠం వైనతేయ నదిలో వెళ్తున్న పడవలు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామంలో నిర్వహించిన పడవ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సుమారు 80కు పైగా పడవలు పాల్గొన్నాయి. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పోటీల్లో మత్స్యకార యువకులు, పెద్దలు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. గోగన్నమఠం రేవు నుంచి పాశర్లపూడిలంకలోని రెబ్బనపల్లి రేవు వరకు నాలుగు కిలోమీటర్లు మేర నిర్వహించిన ఈ పోటీలను తిలకించడానికి స్థానికులు భారీగా తరలివచ్చారు. మొదటిస్థానంలో పెనంగి భైరవస్వామి (రూ.5వేలు), ద్వితీయస్థానంలో కాటాడి మీరా సాహెబ్(రూ.3వేలు), తృతీయ స్థానంలో కాటాడి సత్యనారాయణ (రూ.2వేలు) నిలిచి బహుమతులుగా గెలుచుకున్నారు. ఈ పోటీలను చింతా శ్రీనివాస్, అర్థాని శ్రీనివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టా నరసింహమూర్తి, జె.సత్యనారాయణ, పి.వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కేశవరం రైల్వే గేటు వద్ద ట్రాక్‌పై వాహనదారులు

గమనించి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపివేసిన లోకోపైలెట్



కేశవరంలో రైల్వేట్రాక్‌పై నిలిచిపోయిన రత్నాచల్ రైలు, వాహనదారులు

మండపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం రైల్వే గేటు వద్ద త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అసలు ఏం జరిగిందంటే... విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఉదయం 9 గంట లకు కేశవరం రైల్వే గేటు వద్దకు చేరు కుంటుండగా రైల్వే గేటు వేసి ఉన్నప్పటికీ ట్రాఫిక్ రద్దీ కార ణంగా పలువురు వాహనదారు లు ట్రాక్ మధ్యలో ఉండిపోయారు. ఆ సమయంలో ప్రజలను గమనించిన లోకోపైలెట్ రైలు ను 5 నిమిషాల పాటు నిలుపుదల చేశాడు. గేటుకు అర కిలోమీటరు ముందే నిలుపుదల చేసి పెను ప్రమాదం జరగకుండా కాపాడాడు. ఒకవేళ గమనించపోతే ప్రమాదం జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోవల్సి వచ్చేది. దీంతో లోకో పైలెట్‌ను ప్రజలు అభినందించారు. ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాత రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖకు బయలుదేరింది.

పోలీస్ జాగిలం అర్జున్ మృతి

కాకినాడ ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతి



అర్జున్‌కు సెల్యూట్ చేస్తున్న కాకినాడ ఎస్పీ

కాకినాడ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ జాగిలం (స్నిఫర్ డాగ్) అర్జున్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. అర్జున్ మృతి పట్ల కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అర్జున్‌కు ఘన నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్‌శాఖకు అర్జున్ 13 ఏళ్ల పాటు నిబద్ధతతో సేవలందించిందన్నారు. గతేడాది మే 17న ఉద్యోగ విరమణ పొందిందని, అయినా ఇంకా సేవలందిస్తోందన్నారు. యూనిట్‌లో పనిచేసిన కాలమంతా అత్యున్నత నిబద్ధత, అలర్ట్‌నెస్, క్రమశిక్షణ ప్రదర్శించిందన్నారు. వివిధ ఆపరేషన్లు, శోధనా కార్యక్రమాల్లో, ప్రమాద నివారణా విధుల్లో సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తన స్నిఫింగ్ సామర్థ్యంతో యూనిట్ కార్యకలాపాలకు ముఖ్యమైన సహకారం అందించిందని, అర్జున్ మరణం జిల్లా పోలీస్‌శాఖకు తీరని లోటని తెలిపారు.

టీచర్ దుర్మరణం



జ్యోత్స్నభాయి (ఫైల్)

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని బ్యాంక్ కాలనీకి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్నభాయి (47) దుర్మరణం చెందారు. విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం రాజానగరం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె పని చేస్తున్నారు. స్కూల్ ఆవరణలో బిల్డింగ్ పను లు జరుగుతుండగా స్లాబ్ వేసే క్రమంలో కాం క్రీట్ మోసుకెళ్లే ఐరన్ బక్కెట్ తెగి ఉపాధ్యాయురాలిపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెకు భర్త రెండేళ్ళ క్రితమే గుండెపోటుతో మృతిచెందాడు. భర్త మరణం అనంతరం అత్తగారు, పిల్లలతో కలిసి తుని బ్యాంక్ కాలనీలో ఉంటున్నారు.

బాలికను మోసం చేసిన వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కిర్లంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని మోసం చేసిన వ్యక్తికి ఏడాదిపాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించినట్లు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడు. 2022లో కేసు నమోదు చేసిన కిర్లంపూడి పోలీసులు దర్యాప్తు చేసి చార్జిషీట్ కోర్టులో సమర్పించారు. శుక్రవారం రాజమండ్రి జువెనైల్ జస్టిస్ బోర్డు నిందితుడికి సంవత్సరం పాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ విధించాలని, బాలికకు రూ.2లక్షలు పరిహారం అందజేయాలని తీర్పు ఇచ్చారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థి



హర్షవర్ధని

అంబాజీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి చీకిరమిల్లి హర్షవర్ధని ఎంపికైనట్టు ఇన్‌చార్జి హెచ్ఎం బీర ధర్మరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -19 రన్నింగ్ పోటీల్లో హర్షవర్ధని 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీలు అందె సూర్యనారాయణ, డి.ఉదయభాస్కర్ తెలిపారు. ఈనెల 26 నుంచి హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నూకల రత్నమాల, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, టీచర్లు అభినందించారు.


ముఖ్య గమనిక.. ఇళ్లకు రావద్దు!

- మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజాప్రతినిధులకు పోలీసుల ఆంక్షలు
- మన్యంలోకి రాకుండా అధికార పార్టీ ముఖ్య నేతలకు సూచనలు
- రేపు పెద్ద ఎత్తున నిరసనకు సిద్ధమైన మావోయిస్టులు
- ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పెరిగిన పోలీస్ పహారా

రంపచోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో హిడ్మా, టెక్ శంకర్ వంటి కీలక నేతలతో పాటు 13 మంది మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు మన్యంలో సంచరించకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా ఆంక్షలు విధించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య హోదాల్లో ఉన్న నేతలెవరూ తమ నివాసాలకు రావొద్దని, మన్యానికి దూరంగా ఎక్కడైనా సురక్షిత ప్రాంతాల్లోనే ఉండిపోవాలని సూచించారు. అంతేకాకుండా వారి,వారి నివాసాల వద్ద నిఘాలను కూడా పెంచారు. వారు ఉండే ప్రాంతాల్లో పహారాను పెంచి భద్రత కల్పిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, ఎమ్మెల్సీ అనంతబాబుకు ఇక్కడి పరిస్థితులను వివరించి ఈ మేరకు పోలీసుల తగు సూచనలను చేశారు. అంతేకాకుండా అధికార కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నాయకలు, కీలక నేతలకు సైతం తగు హెచ్చరికలు చేసి సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ రెండు ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు ఇప్పటికే కీలక ప్రకటనలను చేసి ఈ ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఇవి బూటకపు ఎన్‌కౌంటర్లని, నిరాయుధులుగా ఉన్నవారిని పట్టుకుని తీసుకువచ్చి పోలీసులు కాల్చేశారని ప్రకటనలు విడుదల చేసిన మావోయిస్టులు ఈనెల 23న పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై వామపక్ష పార్టీలు కూడా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించాయి. ఎదురవుతున్న వ్యతిరేకత, ఆందోళనల నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఏ ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

కాకినాడ జీజీహెచ్‌లో సంఘటన



మల్లేశ్వరీ (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో 8వ నెల గర్భిణి మరణించిన సంఘటన కాకినాడ జీజీహెచ్‌లో జరిగింది. మృతురాలి వదిన ధనలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన పెసంగి మల్లేశ్వరి (31) ప్రస్తుతం 8వ నెల గర్భిణి. తన వదిన ఏఎన్ఎం అయిన ధనలక్ష్మి సహాయంతో ఈనెల 14న జనరల్ చెకప్ నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు వచ్చింది. గైనిక్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిం చి అబ్జర్వేషన్‌లో ఉండాలని చెప్పడంతో యాంటీనేటల్ వార్డులో చేరింది. ఆసుపత్రిలో చేరే సమయంలో తనకు కొన్ని రకాల మందులు పడవని వైద్యులకు చెప్పగా ఆ సమాచారాన్ని కేస్‌షీట్‌లో పొందుపర్చారు. పడని మందుల్లో ప్యాంటో ప్రాజాల్ కూడా ఉంది. ఈ విధంగా చికిత్స జరుగుతున్న సమయంలో గురువారం మధ్యాహ్నం డాక్టర్ వచ్చి మల్లేశ్వరీకి ప్యాంటోప్రాజాల్ ఇంజక్షన్ ఇస్తుండగా అక్కడికి ధనలక్ష్మి చేరుకుని ఆ ఇంజక్షన్ పడదని అది ఇవ్వద్దని ప్రాధేయపడింది. కోపోద్రిక్తులైన డాక్టర్ బయటకు వెళ్లమంటూ ధనలక్ష్మిని తోసేశారు. అయితే ఇంజక్షన్ చేసిన కొద్ది సమయానికే మల్లేశ్వరీ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అనంతరం వైద్యులు మల్లేశ్వరీని ఐసీయూకు తరలించారు. ఈ క్రమంలో 3 గంటలకు కడుపులో బిడ్డ చనిపోయిందంటూ మల్లేశ్వరీ కుటుంబీకులకు తెలిపారు. అనంతరం మల్లేశ్వరీ దేహంలో చలనం లేకపోయేసరికి వైద్యులు బీపీ చూడ డం, సీపీఆర్ చేయడం చేశారు. ధనలక్ష్మి డాక్టర్‌ను అడిగే సరికి బాగానే ఉంది అంటూ రాత్రి 11.30 వరకు వైద్యం చేస్తున్నట్టే నమ్మించారు. అనంతరం మల్లేశ్వరి చనిపోయిందని చెప్పారు. అయితే ఇంజక్షన్ ఇవ్వడంతోనే మల్లేశ్వరీ చనిపోయిందని, వైద్యులు ముందే చంపేసి ఇప్పుడే చనిపోయిందంటూ తప్పును కప్పిపుచ్చుకుంటున్నారని మృతురాలి కుటుంబీకులు విలపించారు. మృతురాలి బంధువులను వైద్యులు భయభ్రాంతులకు గురిచేయడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.72.88 లక్షలు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కార్తీకమాసం సందర్భంగా వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.72,88,637 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)



ఘటనా స్థలంలో ట్రాక్టర్

రావులపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవింగ్‌పై జీవనం పొందుతున్న ఆ ట్రాక్టరే డ్రైవర్ పట్ల మృత్యువైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ముమ్మిడివర్రాడుకు చెందిన అడపా శ్రీనివాస్(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గడ్డి లోడు వేసుకుని వచ్చేందుకు బయలుదేరి వెళ్లాడు. భోజన సమయం కావడంతో ముమ్మిడివర్రాడు నుంచి పల్లిపాలెం వెళ్లే రహదారిలో మెరక ప్రాంతంలో ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి ఆ చెంతనే ఉన్న హోటల్‌కు భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో ట్రాక్టర్ మెరక మీద ఉన్న కారణంగా ముందుకు కదులుతుండడంతో పరుగున వెళ్లి ఆపే ప్రయత్నం చేసేందుకు అక్కడికి వెళ్లాడు. ఇంజన్ స్టార్ట్ అవ్వడంతో వేగంగా ముందుకు వెళ్లింది. స్టీరింగ్ పట్టుకుని పైకి ఎక్కే సమయంలో కాలు జారి కింద పడిపోవడంతో ట్రాక్టర్ ఇంజన్ టైరు ట్రక్కు టైర్లు అతడి మీద నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి ఎస్ఐ చంటి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

మోతుగూడెంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెనికి విహారయాత్రకు వచ్చి ఈనెల 19న సాయంత్రం పుష్పబ్రిడ్జి వద్ద ఈతకు వెళ్లి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన గనిశెట్టి జగదీశ్వరరావు (26) మృతదేహం శుక్రవారం లభ్యమైందని మోతుగూడెం ఎస్ఐ కె.సాధిక్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తండ్రికి అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ నిబంధన శ్రీను, సన్నీ, సుబ్బా రావు తదితరులు ఉన్నారు.

దింపు కార్మికుడు మృతి

కాట్రేనికోన, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు కర్రి అప్పలరాజు మృతిచెందాడు. మెయిన్‌రోడ్డు పక్కన కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మేకు అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేసరికే అప్పలరాజు మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.పోలీసులు వివరాలు సేకరించారు.

సమస్యల పరిష్కారానికి సంఘాలే కీలకం

రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణు మాధవరావు


రాజానగరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎన్జీవో ఉద్యోగులు

రాజానగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలే కీలకమని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణు మాధవరావు అన్నారు. మండలంలోని వివిధ శాఖల ఉద్యోగుల ఏపీ ఎన్జీవో సంఘ సభ్యత్వ నమోదుపై ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం మండలంలోని వివిధ కార్యాలయాలను సందర్శించారు. ఏపీ ఏసీసీ చైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో ఉద్యోగుల సమస్యలు దశల వారీగా పరిష్కారమవుతున్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి డీఏ మంజూరులో ఏపీ ఎన్జీవో సంఘం చేసిందని, త్వరలో పీఆర్సీ కమిటీని వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు మాట్లాడుతూ 1974 నుంచి ఏపీ ఎన్జీవో సంఘం ఉద్యోగుల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఉద్యోగులంతా ఏన్జీవో సంఘ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు ఎస్.ప్రవీణ్‌కుమార్, జిల్లా ట్రెజరీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ వై.సత్యమూర్తి, కోరుకొండ యూనిట్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కుమార్, చటర్జీ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో సబ్సిడీపై సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదుగురు అభ్యర్థులు గ్రూపుగా ఏర్పడాలని, సఫాయి కర్మచారి సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే ఐదుగురిలో ఒకరికి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, సెప్టిక్ ట్యాంకు పథకం విలువలో సబ్సిడీ పోను మిగిలిన రుణం 6శాతం వడ్డీతో 72 నెలసరి వాయిదాల్లో, ఒక్కొక్క వాయిదా నెలకు రూ.33,064 చొప్పున క్రమం తప్పకుండా కార్యాలయానికి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకంలో ఆసక్తి, అనుభవం, అర్హత కలిగిన అభ్యర్థులు కాకినాడలో జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉనన ప్రగతి భవన్‌లోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ లోపు స్వయంగానీ, పోస్టు ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 62818 17023 నెంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

అట్రాసిటీ చట్టం అమలులో నిర్లక్ష్యం చూపొద్దు

ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆర్డీవో కృష్ణనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమల్లో ఎటువంటి నిర్లక్ష్యం చూపొద్దని, కఠినంగా వ్యవహరించాలని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు, అభ్యంతరాలు, ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి సంబంధించి అమలులో ఉన్న అన్ని కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశంలో డీఎస్పీలు భవ్య కిషోర్, వై.శ్రీకాంత్, బి.విద్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు శిక్షణ

దివాన్‌చెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్న సమయంలో నైపుణ్యాలను మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ ఆఖరి ఏడాది విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వినూత్న ఆలోచన, కమ్యూనికేషన్, ఆవిష్కరణ టీమ్‌వర్క్ సామర్థ్యం వంటి లక్షణాలు అలవడుతాయన్నారు.కార్యక్రమంలో వర్శిటీ ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ జి.తరుణ్ అధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో శుక్రవారం మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌తో ఎంవోయూ కుదుర్చుకుని, కార్నియా సేకరణ కేంద్రాన్ని ప్రారంభించడం, గిరిజన ప్రాంతాలైన చింతూరు, రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో జీఎస్ఎల్ సంస్థ భాగస్వామ్యంతో వైద్య శిబిరాలు నిర్వహించడం, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రెడ్‌క్రాస్‌కు స్థలం కేటాయించేలా జిల్లా స్థాయి అధికారులతో చర్చించి, వైద్యసేవలు ప్రారంభించడం, సభ్యులందరి భాగస్వామ్యంతో నిధులు సేకరించి బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించడం తదితర తీర్మానాలను ఆమోదించారు.సమావేశంలో వైఎస్ చైర్మన్ కేవీ రమణ, ట్రెజరర్ జి.మహలక్ష్మి, బోను రామకృష్ణ, బళ్ల శ్రీనివాసరావు, బి.పద్మావతి, జె.సురేష్,జిల్లా కోఆర్డినేటర్ పాగోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో ధర్మో రక్షితి రక్షితః సినిమా బృందం

అనపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామవరంలో శుక్రవారం ధర్మో రక్షితి రక్షితః సినిమా బృందం సందడి చేసింది. గ్రామ దేవత బాపనమ్మ తల్లిని దర్శించుకున్న చిత్ర బృందంలో దర్శకుడు కట్టా శ్రీకర ప్రసాద్, నిర్మాత ప్రసాద్, కథానాయికి చైత్రా శివన్న తదితరులున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఈ చిత్రంలో జగపతిబాబు, రావు రమేష్, బ్రహ్మాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారని చివరి షెడ్యూల్ త్వరలో పూర్తవుతుందని, జనవరి లేదా ఫిబ్రవరిలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. సినిమా బృందానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, కొండపల్లి సత్యనారాయణ, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, తిరపారెడ్డి, కర్రి వెంకటరెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

ఎంఎల్ఎస్ పాయింట్, రైతు సేవా కేంద్రాల తనిఖీ

కోరుకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులకు పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ, స్టాక్ లభ్యత, పంపిణీ విధానాలు, స్టాక్ రిజిస్టర్ ఆధారంగా కేంద్రం నిర్వహణను పరిశీలించినట్టు చెప్పారు. తదుపరి గాడాలలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు.తేమ మీటర్ పనితీరు, ట్రక్ షీట్ తయారీ విధానాలు, కొనుగోలు ప్రక్రియను ఆర్డీవో సమీక్షించారు. రైతులకు సేవలు మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా అందించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో తహశీల్దార్ వి.సుస్వాగతం, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలిస్వర్గ వేడుకలు


బిక్కవోలులో పోలి స్వర్గ కథను వినిపిస్తున్న అర్చకులు

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగియడంతో శుక్రవారం పోలిస్వర్గ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వేకువ జామునే లేచిన భక్తులు కాలువలు, చెరువుల్లో కార్తీక దీపాలు వదిలారు. సామర్లకోట కాలువలో నీరు లేకపోవడంతో బిక్కవోలులోని భక్తులు స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు.అర్చకులు పోలి స్వర్గ కథను భక్తులకు వినిపించారు. ఆలయంలో కార్తీకమాస ప్రారంభం నుంచి గోలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శివలింగాన్ని గ్రామానికి చెందిన శేఖర్ అనే భక్తుడు రోజుకొక రూపంలో అలంకరిస్తున్నాడు. కార్తీక మాసం ముగియడంతో శుక్రవారం శివలింగాన్ని పూలతో అలంకరించడంతో అందర్నీ ఆకట్టుకుంది.

ధవళేశ్వరం వెంకన్న ఆలయంలో మహా అన్నదానం

ధవళేశ్వరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం నెల రోజులు నిత్యాన్నదానాలు నిర్వహించారు. కార్తీకం ముగింపు సందర్భంగా శుక్రవారం మహా అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా పులిహోర, పువ్వులతో వేంకటేశ్వర స్వామి రూపాన్ని రూపొందించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ నీలి కోటేశ్వరరావు, ఆలయ అధికారి సురేష్ కండువా వేసి స్వాగతం పలికారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గోరంట్ల


కడియపులంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం కడియపులంక, జేగురుపాడు పాములమెట్ట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ముందుగా పల్లాలమ్మ తల్లి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కడియపులంకలో పంచాయతీ నిధులతో నిర్మించే పలు రోడ్లకు శంకుస్థాపన చేశారు.సర్పంచ్ మారిశెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. అలాగే పాములమెట్టలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాములమెట్ట ప్రాంతంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు జరిగాయన్నారు. చైతన్యనగర్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించి అటు చైతన్యనగర్, ఇటు పాములమెట్ట ప్రాంతానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే పుష్కరాల నాటికి నూరుశాతం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, పాతూరి రాజేష్, పాటంశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు, బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీను, ముద్రగడ జమీ, నాగిరెడ్డి రామకృష్ణ పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల్లో గ్రామ సభలు

బిక్కవోలు/రంగంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు, రంగంపేట మండలాల్లోని అన్ని పంచాయతీల్లో శనివారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవోలు వి.శ్రీనివాస్, వీవీ సాయిబాబు తెలిపారు. ఈ సభల్లో ఉపాధి పనులు కావల్సిన వారికి కొత్త జాబ్‌కార్డులు, కొత్త పనులు నమోదు చేస్తారని వారు చెప్పారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డుల శిక్షణలో రాజానగరం ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పారిశుధ్య కార్మికులకు సూచించారు. గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించి, పీపీటీ ద్వారా ప్రదర్శించారు. దీనిలో భాగంగా పారిశుధ్య కార్మికులు రాజానగరంలో శానిటేషన్ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు.. మండలంలో అన్ని గ్రామాల్లో మెగా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈకేవైసీ ప్రక్రియలో తొలగించబడిన జాబ్ కార్డులు వివరాలు, కొత్తగా జాబ్ కార్డులు కావాల్సిన వారికి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అలాగే గ్రామ సభల్లో కొత్త పనులను కూడా ఆమోదిస్తామన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి


బిక్కవోలులో శిక్షణ పొందిన గ్రీన్ అంబాసిడర్లతో ఎంపీపీ సుమ

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచవల్సిన బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదేనని ఎంపీపీ తేతలి సుమ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 78 మంది గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్యదర్శులు, షెడ్‌మిత్రలకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజిలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రీన్ అంబాసిడర్లు బిక్కవోలులోని అన్ని వీధులు, ప్రధాన రహదారులను శుభ్రపరచి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వారంలో రెండు రోజులు గ్రామంలోని ఆవాసాల్లో పర్యటించి చెత్తను సేకరించాలని, గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం జాగ్రత్తలు, మెళకువలు వారికి వివరించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పరిపాలనాధికారి నాగేంద్రప్రసాద్, ఆర్‌పీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకం స్పెషల్స్‌తో ఆర్టీసీకి రూ.36 లక్షల ఆదాయం

జిల్లా ప్రజారవాణా అధికారి మూర్తి



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో వివిధ క్షేత్రాలు, ఇతర ప్రాంతాలకు 36 స్పెషల్ బస్సులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.36 లక్షల ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. శబరిమల 8 బస్సులు, పంచారామాలు 13 బస్సులు, ఏకాదశి రుద్రులు, నవ నందులు, శివ కేశవదర్శిని, కోనసీమ స్పెషల్ 15 బస్సులు నడపడం జరిగిందని తెలిపారు. అలాగే, జిల్లాలోని నాలుగు డిపోల నుంచి అయ్యప్ప భక్తులు మరికొన్ని శబరిమల యాత్ర బస్సులు బుక్ చేసుకోవడం జరిగిందని, ధనుర్మాసంలోనూ ప్రత్యేక యాత్రా బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేతలు ఇళ్లపల్లి, బలభద్రపురం, కాపవరం, మెళ్లూరు, కొంకుదురు ఉన్నత పాఠశాలలను దర్శించి సమస్యలను సేకరించి ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాన్ని అందజేశారు. తమలంపూడి సుధాకరరెడ్డి, బండారు శ్రీనివాసరావు, జంగా శ్రీనివాసప్రసాద్, ఎస్ఎస్‌పీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల దీక్షలు

గోకవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం గోకవరంలోని గంగాలమ్మ గుడి సమీపంలో ఆర్ అండ్‌ఆర్ కాలనీలో పోలవరం నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అర్హులైన వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, కాలనీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కోర్టులో ఉన్న 9 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించాలని డిమాండు చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తామని నిర్వాసితులు పేర్కొన్నారు.

పీఎంఎంఎస్‌వై నిధుల అందజేత

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా స్థానిక కోటిలింగాల పేట మత్స్యకార సంఘ సభ్యులకు పీఎంఎంఎస్‌వై కింద మంజూరైన రూ.2.54 లక్షలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించారు. శుక్రవారం స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో కోటిలింగాలపేట మత్స్యకార సంఘ సభ్యులకు చెక్కును అందించారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము.. గృహ రుణ మంజూరు పత్రాల అందజేత


లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శుక్రవారం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)-2.0 కింద 409 మంది లబ్ధిదారులకు రూ10.22 కోట్లు విలువైన గృహ రుణ మంజూరు పత్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా తో కలిసి వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో పేదలకు రూ.15 కోట్లతో 3,097 ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇచ్చేదని, ఇందులో రూ.1.50 లక్షలు కేంద్రసాయం కాగా రూ.30 వేలు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మ్యాచిగ్ చేసి ఇచ్చేవారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తోందని, ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తుండగా రాష్ట్రం రూ.1 లక్ష సాయాన్ని అందిస్తోందన్నారు. వీటితో పాటు లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి సుమారు 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నగరంలో 5800 మందికి కొత్త రైస్ కార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ రాష్ట్రానికి ఇటీవల కేంద్రం 5 లక్షలు నూతన ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇళ్ల లబ్ధిదారులు నిర్దేశిత గడువులోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ దాసరి ప్రియ సౌజన్య, హౌసింగ్ పీడీ బుజ్జి, యానాపు యేసు, కార్పొరేషన్ ఏసీ పీవీ రామలింగేశ్వర్, ఈఈ ఆలీ, హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సోమనాథ్ వజ్ర శివలింగ రథోత్సవం

అనపర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమనాథ్ వజ్ర శివలింగం రథయాత్ర వైభవంగా జరిగింది. బ్రహ్మకుమారీస్ మందిరం వద్ద ప్రత్యేక పూజల అనంతరం రథయాత్రను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న సోమనాథ్ వజ్ర శివలింగం శుక్రవారం అనపర్తి చేరుకుంది.పుర వీధుల్లో సాగిన ఈ యాత్రకు గ్రామంలోని భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. అయ్యప్ప, సుబ్రహ్మణ్యేశ్వర మాలధారులు కలశాలు చేతపట్టుకుని యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అనపర్తి ఇన్‌చార్జి సుశీల, రజని, చక్రధర్ మీరా, దత్త నాగసాయి ఆనందాశ్రమ అధినేత సత్తి దేవదానరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారోత్సవాలు

అనపర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యాంటీ మైక్రో బియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని దుప్పలపూడిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాధులకు యాంటీ బయోటిక్స్ వాడడం వల్ల రెసిస్టెన్స్ పెరిగి దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. సాధ్యమైనంత వరకు చిన్నారులకు యాంటీ బయోటిక్స్ వాడకం తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కేవీవీ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మణికంఠ, అంగన్‌వాడీలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాయం కోసమని ఇచ్చిన బంగారం తిరిగివ్వమంటే చంపుతానని బెదిరింపు

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో వున్న వ్యక్తికి సాయం కోసం ఇచ్చిన బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వమంటే చంపుతానని బెదరిస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలుకు చెందిన ముప్పిన నిహారికకు జగ్గంపేటకు చెందిన గణేష్‌కుమార్‌తో వివాహమైంది. నిహారిక మామ ఇంటికి వెళ్లి వచ్చే సమయంలో అక్కడ ఉన్న సురేష్‌తో పరిచయమయ్యింది. ఇద్దరూ కొన్నిసార్లు ఫోన్‌లో మాట్లాడుకునేవారు. దీంతో సురేష్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని సాయం చేయమని కోరగా నిహారిక బంధువులకు తెలియకుండా 13.5 సవర్ల బంగారు ఆభరణాలను అతనికి తనఖా పెట్టుకొనేందుకు ఆగస్టు 13న ఇచ్చింది. ఆపై సురేష్‌కు ఫోన్ చేస్తుంటే స్పందించకపోవడంతో పాటు బంగారు ఆభరణాలు ఇవ్వడానికి నిరాకరించాడు. అంతే కాకుండా నిహారికను, ఆమె కుటుంబసభ్యులను చంపుతానని బెదరించడంతో మోసపోయానని గుర్తించి నిహారిక తమకు ఫిర్యాదు చేసిందని ఎస్ఐ వివరించారు.

హైస్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్ అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి ఘాట్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ధవళేశ్వరం జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. వాటిని ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బాలేష్‌గుప్త ఆదేశాలతో హెడ్ మాస్టర్ ఈవీవీఎస్ఆర్ ప్రసాదరావుకు అందజేశారు.కార్యక్రమంలో యియ్యపు మురళీధర్, మద్దుల మురళీకృష్ణ, యలమర్తి వెంకటేశ్వరరావు, దేవత సుధాకర్,మండవిల్లి వెంకట్రాజు, లక్కోజు వీరభద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

రాజమహేంద్రవరం కల్చరల్/ రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్‌లోని టౌన్ హాల్‌లో ఉన్న జుబ్లీ లైబ్రరీలో శుక్రవారం వివిధ సాంస్కృతిక పోటీలు, విద్యార్థులకు వ్యాస, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మద్దూరి శివసుబ్బారావు విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ బీఈడీ కాలేజీలో ప్రిన్సిపాల్ కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుస్తక సమీక్ష, ప్రదర్శన, క్విజ్, వక్తృత్వ, డిజిటల్ రిసోర్సెస్ అవగాహన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి వై.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించుకోవాలి: నల్లమిల్లి


రంగాపురంలో చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చెరువులు, నీటి కుంటలను పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.రంగాపురంలో కుడుముల చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. చెరువులను అభివృద్ధి చేసుకుని ఆయకట్టు పెంచుకోవడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరగడంతో పాటు, పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని అన్నారు. 2014-19లో గ్రామంలో వెంకట్రాజు చెరువును అభివృద్ధి చేయడంతో నేడు ఏటా పంచాయతీకి రూ.23 లక్షలు ఆదాయం సమకూరుతుందన్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా ప్రకృతి పరిరక్షణ కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని, త్వరలో కేంద్ర మంత్రి రాష్ట్రానికి రానున్నారని ఇందులో భాగంగా నియోజవర్గంలో చెరువుల అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో అప్పలస్వామి, చిరంజీవిరాజు, గౌరిశంకర్, ఎంపీటీసీ కేతా ఏసురత్నం, చెల్లే జోష్‌బాబు, కానాటి దుర్గాప్రసాద్, నక్కా సత్యనారాయణ, నడింపిల్లి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కైలాస భూముల నిర్మాత పట్టపగలు వెంకట్రావుకు సతీవియోగం


రామలక్ష్మి(ఫైల్)

రాజమహేంద్రవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకుడు, కోటిలింగాలు, ఇన్నీస్‌పేట కైలాస భూముల నిర్మాణ, మహాకాలేశ్వరాలయం నిర్మాత పట్టపగలు వెంకట్రావు సతీమణి అనంతరామలక్ష్మి(72) అనారోగ్యంతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. విశాఖ అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన మన్నె వెంకట్రావు,అచ్చియమ్మ దంపతుల ప్రథమ కుమార్తె ఆమె.1969లో పట్టపగలు వెంకట్రావుతో వివాహం జరిగింది.వీరికి నలుగురు కుమార్తెలు. అనంతలక్ష్మి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి తరపున ఇన్నర్ వీల్‌క్లబ్ చైర్మన్‌గా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సప్నా ఎక్సలెన్స్ అవార్డుకు పడాల సుబ్బారెడ్డి ఎంపిక



అనపర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరానికి చెందిన నటరాజ నృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ ప్రతి యేటా అందించే సప్నా ఎక్సలెన్స్ అవార్డుకు అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డిని ఎంపిక చేసినట్టు సమితి వ్యవస్థాపక సభ్యుడు దుర్గాప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. సమితి ద్వారా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేశామని, ఈనెల 23న అందజేస్తామన్నారు.

'జాగ్రత్తలు తీసుకుంటున్నాం'

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో అనూహ్య మార్పులతో ప్రస్తుతం వైరల్ న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయని, ప్రభుత్వ బోధనాసుపత్రిలో వైద్యసేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెద్దలతోపాటు పిల్లల్లోనూ జ్వరపీడితులు ఉన్నారని, వైరల్ న్యుమోనియా ఎక్కువగా కనిపిస్తోందన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 22 నవంబరు 2025 | 5





రైతులకు వాయు'గండం'

- 24 నుంచి 29 వరకూ వర్షాలు పడే అవకాశం
- మొంథా తుఫాన్‌తో 20 శాతం నష్టపోయిన రైతులు
- పంట చేతికొచ్చేసరికి మరో గండం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా రైంతాంగాన్ని మరో తుఫాన్ వెంటాడుతోంది. గత నెలలో మొంథా తుఫాన్‌తో కుదేలైన రైతాంగం నెమ్మదిగా కోలుకుని, పంటను దక్కించుకునే ప్రయత్నంలో ఉన్న సమయంలో మరో తుఫాన్ ముంచుకొస్తోంది. సెన్‌యార్ తుఫాన్ ప్రభావం వల్ల ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకూ ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరిక కేంద్రాల సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులకు పలు సూచనలు చేస్తోంది. తుఫాన్ ప్రభావం ఉంటే మాత్రం రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తుఫాన్ సమాచారం తెలుసుకోవడంతోపాటు పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో 76,941 హెక్టార్లలో వరి సాగు చేశారు. దీని ద్వారా సుమారు 5 లక్షల 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇందులో ఇంత వరకూ 29,273.78 హెక్టార్లలో మాసూళ్లు పూర్తయ్యాయి. సుమారు లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. అందులో సుమారు లక్ష టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇంకా 75 వేల టన్నుల ధాన్యం బయట ఉంటుంది. ఈలోపుగా ఈ ధాన్యం అంతా కొనుగోలు చేస్తే చాలావరకూ సమస్య తగ్గుతుంది. చాలామంది రైతులు ధాన్యం తేమ శాతం తగ్గించుకోవడం కోసం రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లోనూ, పొలాల్లోనూ ఎండ బెడుతున్నారు. వారంతా వెంటనే ఆ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం మంచిది. మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో 25 వేల హెక్టార్లలో వరి పంట నష్టపోయింది. దాని విలువ రూ.36 కోట్లు. మినప కూడా దెబ్బతింది. దాని నష్టం రూ.1.7కోట్లు. ఉద్యావన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పంట ఉంది. కడియం, ఉండ్రాజవరం మండలాల్లో కోతలు మొదలు కాలేదు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు ఎక్కువగా ఉంటే తగ్గేవరకూ కోతలు ఆపాలని కోరారు. కోసిన పంటను, ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచాలని పేర్కొన్నారు.



కార్తీకం పరిసమాప్తం

కార్తీక మాసం ముగింపు రోజు పోలిస్వర్గం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నదిలో మహిళలు స్నానాలు చేసి దీపాలు పెడుతున్న దృశ్యం. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

మళ్లీ గుంతలు

మొంథా తుఫాన్‌తో రహదారులకు తూట్లు



తాళ్లపూడి మండలంలోని పైడిమెట్ట వద్ద రహదారి పరిస్థితి

- వాహనాల గంతులు
- జనాల ఒళ్లు హూనం
- అన్ని రోడ్ల దుస్థితీ ఇదే







కొవ్వూరు-పశివేదల రోడ్డులో గోతులు.. ఉండ్రాజవరం మెయిన్ రోడ్డు, కానూరు-ఉసులుమర్రు రోడ్డు దుస్థితి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రోడ్లు గుంతలు.. వాహనాలు గంతులు చందంగా జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు చెందిన రోడ్ల పరిస్థితి ఉంది. ఈ రోడ్ల మీద ప్రయాణించేవారి ఒళ్లు హూనం అయిపోతోంది. అనేక రోడ్లకు రిపేర్లు చేసినా అవి మళ్లీ గుంతలు పడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సంక్రాంతి ముందు గుంతలు పూడ్చింది. కానీ మొంథా తుఫాన్ వల్ల మళ్లీ గోతులు పడ్డాయి. జిల్లాలో 87.99 కిలోమీటర్ల ఉన్న 48 ఆర్‌అండ్‌బీ స్టేట్ హైవే రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక పంచాయతీరాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. ఇది అధికారుల లెక్క. ఇవికాకుండా అనేక పంచాయతీల పరిధిలో అనేక లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 60 పంచాయతీరాజ్ రోడ్లు గుంతలమయం అయ్యాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజానగరం నుంచి పెద్దపర్తిరేవు రోడ్డు 9.2 కిలోమీటర్ల మేర, సోమేశ్వరం నుంచి రాజానగరం రోడ్డు 8 కిలోమీటర్ల మేర దెబ్బతింది. కొవ్వూరు డివిజన్ పరిధిలో మార్టేరు -పక్కిలంక రోడ్డు, ఏజీఆర్‌బీ రోడ్డు, విజ్జేశ్వరం-నిడదవోలు రోడ్డు, నిడదవోలు- అశ్వరావుపేట రోడ్డు, నరసాపురం-అశ్వరావుపేట రోడ్డు, యర్నగూడెం- పొంగుటూరు రోడ్డు, తాడేపల్లి- అనంతపల్లి రోడ్డు చేబ్రోలు-దేవరపల్లిరోడ్డు, మద్దూరు బ్రిడ్జి నుంచి చంద్రవరం రోడ్డు, ఏజీఆర్‌బీ బల్లిపాడు నుంచి అన్నదేవరపేట రోడ్డు, గజ్జరం నుంచి హుకుంపేట రోడ్డు, ఎన్‌హైె రోడ్డు నుంచి ఈజీకే రోడ్డు వయా కురుకూరు, పల్లంట్ల, లక్ష్మీపురం రోడ్డు, నల్లజర్ల నుంచి లక్ష్మీనగరం రోడ్డు పలుచోట్ల గుంతలమయం అయ్యాయి. ఇక పంచాయతీరాజ్‌కు చెందిన 33 రోడ్లు 69.465 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. వీటివల్ల రూ45.81 కోట్లు నష్టం జరిగింది. అన్ని మండలాల పరిధిలోను దెబ్బతిన్నాయి. చాలా గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్డు పెద్దపెద్ద గోతులుగా మారాయి. కొవ్వూరు- మద్దూరు రోడ్డు, చంద్రవరం-మద్దూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వాడపల్లి కాలనీరోడ్డు, ఏజీఆర్‌బీ నుంచి తోగుమ్మిరోడ్డు, దేచర్ల అప్రోచ్‌రోడ్డు, అన్నదేవరపేట నుంచి సూర్యారావుపేట రోడ్డు, వేగేశ్వరం నుంచి అన్నదేవరపేట, ఎంపీ రోడ్డు నుంచి చాగల్లు రైల్వేఫీడర్ రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. అనపర్తిలో దొంతమూరు బీటీ రోడ్డు నుంచి నల్లమిల్లి రోడ్డు, ఏడీబీ రోడ్డు నుంచి వడిసలేరు, బిక్కవోలు నుంచి బలభద్రపురం, బలభద్రపురం నుంచి కానేడు మీదగా నల్లమిల్లి, ఆర్ అండ్‌బీ నుంచి తుమ్మలపల్లి, ఇల్లపల్లి మీదుగా రంగాపురం, కొండుకుదురు వి.సావరం, కుతుకులూరు నుంచి పులగుర్త, ఎల్ఎన్ పురం నుంచి మహేంద్రవాడ రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎల్ఎన్‌పురం, అనపర్తి నుంచి ద్వారపూడి ఐఎల్ టీడీ పుంతరోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. రంగంపేట మండలంలో ముకుందవరం నుంచి ఏడీబీ రోడ్డు, సుబ్రహ్మణ్యపేట నుంచి ముకుందవరం, ఆర్ఎస్ రోడ్డు నుంచి వడిసలేరు, ఈస్ట్ గోనగూడెం రోడ్డు పాడయ్యాయి. గోపాలపురంలో పీజే రోడ్డు నుంచి మీటు గోపాలపురం, సాగిపాడు రోడ్డు, పీజే రోడ్డు నుంచి కోమటిగుంట, నల్లజర్ల మండలంలో చోడవరం నుంచి గుండే పల్లి, దేవరపల్లి నుంచి అచ్చయ్యపాలెం, దేవరపల్లి మండలంలో చిన్నాయిగూడెం నుంచి కుంతలగూడెం, వైకె రోడ్డు నుంచి గాంధీనగర్, నల్లజర్ల మండలంలో చేదర్శిగుంట నుంచి పోతరం, జి. కొత్తపల్లి రోడ్డు, అనంతపల్లి నుంచి కవులూరు రోడ్డు బాగా దెబ్బతిన్నాయి. ఉండ్రాజవరం మండలంలో తణుకు-పాలగుమ్మి సరిహద్దు పుంత, తణుకు -సావరం సరిహద్దు పుంత, వేలివెన్ను నుంచి నందమూరు అక్విడక్టు, వేలివెన్ను ఎస్‌సి ఏరియా నుంచి దమ్మెన్ను రోడ్డు పాడయిపోయాయి. వెలగదుర్రు గ్రామ రోడ్డు, కెవెల్‌కె రోడ్డు నుంచి తాడిపర్రు-పాలగుమ్మి, ఉండ్రాజవరం రోడ్డు బాగా దెబ్బతిన్నాయి. నిడదవోలులో పురుషోత్తపల్లి నుంచి గోదావరి రివర్ బండ్, డి.ముప్పవరం నుంచి పురుషోత్తపల్లి రోడ్డు, శెట్టిపేట నుంచి వేలివెన్ను రోడ్డు, ఎన్‌హైరోడ్డు నుంచి సూరాపురం, విజ్జేశ్వరం గ్రామ రోడ్డు, ఎంపీ రోడ్డు నుంచి కోరుపల్లి రోడ్డు, దెబ్బతిన్నాయి. పెరవలి మండలంలో కానూరు నుంచి పెరవలి వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు, కానూరు-నడిపల్లి కోట రోడ్డు, పెరవలి - ముక్కామల రోడ్డు దారుణంగా దెబ్బతిన్నాయి. కానూరు నుంచి ఉసులుమర్రు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు, సిమెంటు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు అయినట్టు మంత్రి దుర్గేష్ ప్రకటించినా పనులు ప్రారంభం కాలేదు. తాళ్లపూడి మండలంలో పైడిమెట్ట- అన్నదేవరపేట రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారడంతో జనం నరకం చూస్తున్నారు.

నగదు రహితమే లక్ష్యంగా..



జాతీయ, రాష్ట్ర రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద టోల్‌ఫీ చెల్లింపులన్నీ నగదు రహితంగా సాగాలన్న లక్ష్యంతో సమూల మార్పులు చేస్తున్నారు. టోల్‌ఫీ చెల్లింపులు ఫాస్టాగ్ ద్వారానే జరిగేలా ప్రోత్సహిస్తూనే నగదు చెల్లిస్తే రెట్టింపు చార్జీలు చెల్లించే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందని నేషనల్ హైవే అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వార్షిక పాస్‌లను అమల్లోకి తెచ్చింది.



- టోల్‌ప్లాజాల వద్ద టోల్‌చార్జీల చెల్లింపులో మార్పులు
- ఫాస్టాగ్ ఉంటే సాధారణ చార్జీలే
- నగదు చెల్లిస్తే 100 శాతం అదనం
- యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతమే అదనం
- ఇప్పటికే అమల్లోకి వార్షిక పాస్‌లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్యగల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్నాయి. దీంతోపాటు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద, నల్లజర్ల మండలం వీరవల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ అధీనంలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్నిరకాల కార్లు, వ్యాన్‌లు, ఫోర్‌వీలర్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.

ఫాస్టాగ్ లేకుంటే 100 శాతం అదనం

టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుం కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ ఖాతాలో సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుంకంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. నగదు చెల్లింపులు చేసేవారికి 24 గంటల వ్యవధిలో రాకపోకలు పూర్తిచేసి టోల్‌ను దాటితే టోల్‌ఫీజు చెల్లింపులో ఉన్న రాయితీలు వర్తించవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది.

యూపీఐ ద్వారా చెల్లిస్తే..

ఫాస్టాగ్‌లో నగదు లేకున్నా, అసలు వాహనానికి ఫాస్టాగ్ లేకున్నా ఇప్పటివరకూ వాహనదారులు నగదు రూపంలోనే 100శాతం అదనంగా టోల్‌గేటుల వద్ద ఫీజులు చెల్లించాల్సి వచ్చేది. ఈ విధానంలో మార్పులు తెస్తూ కేంద్రం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నేషనల్ హైవే అథారిటీ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే టోల్‌ఫీజుకు అదనంగా 25 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని నవంబరు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. నగదు చెల్లిస్తే మాత్రం 100శాతం బాదుడును వాహనదారులు భరించాల్సి ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి టోల్‌గేటుల వద్ద ఫీజుల చెల్లింపులు నగదు రూపంలో జరగకూడదనేది కేంద్రం లక్ష్యమని హైవే అథారిటీ అధికారి ఒకరు తెలిపారు.

వార్షిక పాస్‌లకు ఆదరణ

ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించేలా కేంద్రం తీసుకువచ్చిన నూతన విధానానికి వాహనదారులు నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కోసం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫాస్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై గల ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200సార్లు ఏదిముందైతే దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. కార్లు, జీపులు, వ్యాన్‌లు వంటి వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌ను వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లోని టోల్‌గేట్‌ల వద్ద మాత్రం సాధారణ పద్ధతిలో ఫాస్టాగ్ ద్వారా టోల్‌ఫీ చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్ లేనివారు చాలావరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.



ధవళేశ్వరం గోదావరిలో చేప పిల్లలను నదిలో విడిచిపెడుతున్న కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

గోదావరిలో చేప, రొయ్య పిల్లలను విడుదలచేసిన కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం,నవంబరు21(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలు అందిపుచ్చుకుని మత్స్యకారులు మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ చేకూరి కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం స్థానిక కంచర్ల లైన్ రేవు వద్ద గోదావరిలోకి 50 లక్షల చేప పిల్లలు, 5 లక్షల రొయ్య సీడ్‌ను విడుదల చేశారు. జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మలాకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారవర్గాల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లా పరిధిలో గుర్తింపు పొందిన సుమారు 4 వేల మంది మత్స్యకారులు వేటవృత్తిలో ఉన్నారని, అనేక మంది గుర్తింపు లేకుండానే వేట వృత్తిలోనే కొనసాగుతున్నారని తెలిపారు. అటువంటి వారి కుటుంబాల రిజిస్ట్రేషన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గోదావరిలో వేటపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారులకు జీవనోపాధి పెంపొందించే విధంగా గోదావరిలో మత్స్య సంపద పెరిగేటట్లు ఏటా చేప పిల్లలను వదులుతున్నామన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే గోదావరిలోకి చేప, రొయ్య పిల్లలను విడుదల చేశారు. ఆర్డీవో కృష్ణనాయక్, మత్స్యశాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్టార్టప్స్ నుంచి పరిశ్రమల దిశగా ఆర్‌టీహెచ్'



నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్రతినిధులతో మాట్లాడి వారి ఆలోచనలపై చర్చించి ప్రారంభ దిశలో ఉన్న పలు ఉత్పత్తులు, ఇన్నోవేషన్ నమూనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘస్వరూప్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు యువ స్టార్టప్‌లకు విలువ జోడింపు ఆధారంగా కొత్త అవకాశాలు లభించేలా ఆర్‌టీహెచ్ బలమైన వేదికగా మారాలని తెలిపారు. కడియం నర్సరీ పూల వ్యర్థాలను సమర్థవంతంగా వంద శాతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. బయోగ్యాస్ ఉత్పాదికత సాకారం అయ్యేలా ఆర్ఎంసీ కమిషనర్‌తో కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేయాలని ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో పలు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభోత్సవంలో శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ తదితరులు

'గ్రీన్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన పర్యావరణ మార్పు'

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బయో ఆధారిత ఆవిష్కరణలు, గ్రీన్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన పర్యావరణ మార్పునకు పరిశోధకులతో కూడిన సదస్సులు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. తొలిరోజున శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఆర్ ప్రసాద్, ఉన్నత విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ ఆర్‌కే ప్రసాద్ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఇప్పటివరకూ జరిగిన ఆవిష్కరణలను వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్ కూడా నిర్వహించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● న్యూడెమోక్రసీ నాయకుల డిమాండ్



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు హిడ్మా, తదితరుల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కేఆర్‌సీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పట్టుబడిన వారిని కాల్చి చంపడం చట్టారీత్యా నేరమని, అలాగే రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్, పీవోడబ్ల్యు నాయకురాలు ఈమని మల్లిక, అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు జల్లి సత్తిబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు టీ పొడి పంపిణీ : తహశీల్దార్



నూతన తహశీల్దార్ కృష్ణారావును సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

నల్లజర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల నుంచి రేషన్ లబ్ధిదారులకు టీ పొడి పంపిణీ చేస్తామని తహశీల్దార్ పి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యా లయంలో రేషన్ డీలర్లకు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అందించడం జరుగుతుంద న్నారు. రూ. 10, రూ. 20 ప్యాకెట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం రేషన్ డీలర్లంతా నూతనంగా తహశీల్దార్ బాధ్యతలు చేపట్టిన కృష్ణారావును సత్కరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, అచ్యుత భాస్కరరావు, చీమకుర్తి చంద్రం, నాగు, మహేశ్, అబ్బాస్, ఈబిచర్ల కృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

నిడదవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరూ పోటీతత్వాన్ని అలవర్చు కోవాలని పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి అన్నారు. శుక్రవారం వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.నాగేశ్వరరావు, డాక్టర్ కె.జాస్మిన్, చక్రధరరావు, ఎస్.నాగేశ్వరరావు, డాక్టర్ జీ.రాహుల్ అధ్యాపక బృందం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వారు అందించిన వివరాలివి పట్టణంలోని యానాదికాలనీకి చెందిన బొజ్జా కోట సత్యనారాయణ (43) ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని డ్రైనేజీలో సత్యనారాయణ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నూతన కమిటీలు తప్పనిసరిగా ప్రతినెలా మొదటివారంలో గ్రామ, మండల కమిటీల సమావేశాలు నిర్వహించి తీర్మాణాలు నమోదు చేసి, నియోజకవర్గ కార్యాలయానికి పంపించాలన్నారు. అలాగే పార్టీ, అనుబంధ కమిటీలలో కొత్తగా పదవులు పొందిన వారంతా యాక్టివ్‌గా ఉండాలన్నారు. మరో మూడు నెలల్లో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయన్నారు. మండలాల వారీగా రిజర్వేషన్లు త్వరలో ప్రకటించనున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షులు అర్జిల్లి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు బేతిన నారాయణ, మద్దిపాటి సత్యనారాయణ, గొరిజాల సురేష్, మేకల శ్రీను, గెల్లా సురేష్, జొన్నా బాలకృష్ణ, బొబ్బిలి పేర్రాజు, బర్ల శ్రీనివాస్, ఆకుల నగేష్, వేమగిరి వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన గూటాల వెంకట సత్యనారాయణకు రూ.1,25,000, పైలా సత్యనారాయణకు రూ.68,606, పెనకనమెట్టకు చెందిన పసలపూడి సునీతకు రూ. 35,569, తాళ్లపూడి మండలం బల్లిపాడుకి చెందిన చిడిపి రాజుకు రూ.82,096 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు

నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను రాత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షులు అర్జిల్లి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు బేతిన నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సారా బట్టీలపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

తాళ్లపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ పరిధి సూరయ్యపేట, భీమోలు సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారు చేస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు బట్టీలపై శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడిలో పాల్గొన్న ఎస్ఐ టీ. రామకృష్ణ తన సిబ్బందితో కలిసి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయించారు.

మత్స్యకారులకు చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) ద్వారా మంజూరైన చెక్కులను మత్స్యకారులకు పంపిణీ చేశారు. కొవ్వూరు వాడబలిజ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు రూ. 2,54,000, తాళ్లపూడికి చెందిన అగ్నికుల క్షత్రియ ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీకి రూ.81,645 చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. మత్స్యశాఖ ఏడి దిల్షద్ మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై పథకంలో 100 మంది కంటే ఎక్కువ మంది సభ్యుల ఉన్న సంఘాలకు ప్రభుత్వం సొసైటీ నిర్వహణ ఖర్చుల నిమిత్తం కొంతమొత్తం అందజేస్తుందన్నారు. సొసైటీ అకౌంట్‌లో సభ్యునికి రూ. 2000 చొప్పున షేర్ ధనం చూపించినట్టయితే వ్యాపార అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం రూ. 2000 అందజేస్తుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రూ. 50 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు అర్జిల్లి రామకృష్ణ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ కృష్ణవేణి, వీఎఫ్ఏలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు

దేవరపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి విద్యతో పాటు సృజనాత్మక శక్తి ఉంటే అన్నిరంగాల్లో విజయం సాధించవచ్చని దేవరపల్లి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ జీ.వినూత్న అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు నాసా కార్యక్రమంలో భాగంగా కిట్లను ఎంఈవో తిరుమలదాసు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం పార్థసారధి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నిడదవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మహబూబ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులంతా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్ మాట్లాడుతూ నందిగూడెంకు చెందిన గౌతమ్‌రెడ్డి అనే న్యాయవాదిపై కొందరు వ్యక్తులు ఆఫీసుకు వెళ్లి దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రరావు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రామచంద్రరావు

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశివేదల డి.రంగరాయ విశాల సహకార పరపతి సంఘం అధక్షుడు గారపాటి రామచంద్రరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కేక్ కట్‌చేసి, పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. గారపల్లి శ్రీనివాసరావు, రాయపాటి సుబ్బారావు, తాళ్లూరి సత్యనారాయణ, నూదిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొన్నాకు ఘన సత్కారం



నిడదవోలులో కృష్ణబాబును సత్కరించిన దృశ్యం

నిడదవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసమంతా ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తులకు ప్రవచనాలు అందించిన పొన్నా కృష్ణబాబు శర్మ సేవలు ఎంతో అభినందనీయమని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు లక్ష్మీ నరసింహశాస్త్రి అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త పొన్నా కృష్ణబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కార్తీకమాస విశిష్టతను ప్రతిరోజు సాయంకాలం పురాణ రూపంలో ప్రవచనాల ద్వారా ఎంతో విలువైన జ్ఞానాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉత్తమ రైతుగా కుందుల



జిల్లా ఆక్వా పరిశ్రమలో ఉత్తమ రైతుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

పెరవలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజమండ్రిలో నిర్వహించిన కార్యక్రమంలో తీపర్రుకు చెందిన కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆక్వా పరిశ్రమలో ఉత్తమ రైతుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత , రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జిల్లా మత్స్యశాఖ జేడీ నిర్మలకుమారి సమక్షంలో ఆయనకి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

రమణకు అవార్డు

పెరవలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహకార వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ పని తీరు కనబరిచిన ఖండవల్లి సహకార సంఘం సీఈవో టీవీ రమణకు అవార్డుకు అందజేశారు. రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో సహకార అధికారి ముళ్ళపూడి వెంకట రమణ చేతులమీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

పెరవలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కానూరు , కాకరపర్రు పాఠశాలల్లో కొవ్వూరు శక్తి టీమ్ శుక్రవారం సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడటచ్ పలు రకాల చట్టాలు, ఒన్ ఒన్ టు కాల్స్ , సైబర్‌మోసాలు, తదితర నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులతోపాటు ఎస్ఐ ఎం. వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ గంగాధరరావు, పద్మ, భవాని, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీపై కేసు

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారపు గొలుసు దొంగిలించుకుపోయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరానికి చెందిన ఈదూరి మహాలక్ష్మి నిడదవోలు మున్సిపాల్టీలోని సెర్ప్ విభాగంలో పనిచేస్తోంది. కాగా, శుక్రవారం విధులు ముగించుకుని ఇంటికి రావడానికి ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఈ క్రమంలో కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన టోలిగేటు సెంటరు వచ్చేసరికి బస్సులో వెనుకకూర్చున్న గుర్తుతెలియని వ్యక్తి మెడలో ఉన్న రెండు కాసుల బంగారపు గొలుసు లాక్కొని పారిపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైభవంగా సోమనాథ్ వజ్ర శివలింగ రథోత్సవం

అనపర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమనాథ్ వజ్ర శివలింగం రథయాత్ర వైభవంగా జరిగింది. బ్రహ్మకుమారీస్ మంది రం వద్ద ప్రత్యేక పూజల అనంతరం రథయాత్రను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న సోమనాథ్ వజ్ర శివలింగం శుక్రవారం అనపర్తి చేరుకుంది.పుర వీధుల్లో సాగిన ఈ యాత్రకు గ్రామంలోని భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. అయ్యప్ప, సుబ్రహ్మణ్యేశ్వర మాలధారులు కలశాలు చేతపట్టుకుని యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అనపర్తి ఇన్ చార్జి సుశీల, రజని, చక్రదర్ మీరా, దత్త నాగసాయి ఆనందాశ్రమ అధినేత సత్తి దేవదానరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ జీ.తరుణ్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో శుక్రవారం మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌తో ఎంవోయూ కుదుర్చుకుని, కార్నియా సేకరణ కేంద్రాన్ని ప్రారంభించడం, గిరిజన ప్రాంతాలైన చింతూరు, రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో జీఎస్ఎల్ సంస్థ భాగస్వామ్యంతో వైద్య శిబిరాలు నిర్వహించడం, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రెడ్‌క్రాస్‌కు స్థలం కేటాయించేలా జిల్లా స్థాయి అధికారులతో చర్చించి, వైద్యసేవలు ప్రారంభించడం, సభ్యులందరి భాగస్వామ్యంతో నిధులు సేకరించి బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించడం, తదితర తీర్మానాలను ఆమోదించారు. వైఎస్ చైర్మన్ కేవీ రమణ, ట్రెజరర్ జీ.మహాలక్ష్మి, బోను రామకృష్ణ, బళ్లా శ్రీనివాసరావు, తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఎంపీడీవో టీడీవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ

కొవ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశుద్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో టీడీవీ రమణ అన్నారు. పంగిడిలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పారిశుధ్యంపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో ఏ.స్లీవారెడ్డి, సర్పంచ్ గోశాల నాగార్జున, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఉప సర్పంచ్ ఉప్పులూరి నానాజీ, డిప్యూటీ ఎంపీడీవో బీవీ ప్రకాశరావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: గ్రీన్ అంబాసిడర్లంతా మరింత చైతన్యవంతంగా పనిచేసి గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలని, అందుకు అవసరమయ్యే వసతులను సమకూర్చుతామని ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి అన్నారు. అన్నదేవరపేటలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి డీఎస్సీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రతపై ఒక్కరోజు అవగాహన సదస్సును నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఎస్. వేణుగోపాలరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ వీరన్న విచ్చేశారు. ముందుగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఆర్‌సీ రవిప్రకాష్, సచివాలయ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లు, గ్రీన్ గార్డులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రామాల్లో ఇంటింటా తడి చెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీవో ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15 గ్రా మాలకు చెందిన గ్రీన్ అంబాసిడర్లకు, క్లాప్‌మిత్రలకు వేలివెన్నులో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటింటా సేకరించిన తడిచెత్తను సంపద తయారీ కేంద్రం వద్ద నాడెప్ పిట్‌లలో వేయాలన్నారు. దీని ద్వారా వర్మీకంపోస్టు తయారు చేసి గ్రామపంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో కె. ఇంజనేయశర్మ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు పారిశుధ్యకార్మికులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. అదే విధంగా డ్రైనేజీలు ద్వారా మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయన వివరించారు. గ్రామాల్లో చెత్తసేకరణ ఎలా చేయాలని, సంపద తయారీ కేంద్రాలు వద్ద వాటిని ఎలా నిర్వహించాలనే అంశాలపై ట్రయినర్ ఏ. శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఏవో వివిఎస్ రామారావు, మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కె. ప్రకాశ్, స్థానిక పంచాయతీ సభ్యులు, పారిశుద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో ...

గోపాలపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎంపీడీవో జీ.రాజమనోహర్ అన్నారు. జగన్నాథపురంలో శుక్రవారం క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించటంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్తసేకరణకు ప్రతిఒక్కరూ సహకరించి ఇళ్లలోని తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి హరితరాయబారులకు అందించాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఆర్.సుజాత, ఏవో మంగతాయారు, ఉప సర్పంచ్ పసుమర్తి రాఘవచౌదరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లిలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో

దేవరపల్లి: చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఎల్‌డీఓ ప్లేవరెడ్డి పేర్కొన్నారు. దేవరపల్లిలో చెత్త నుంచి సంపద తయారి కేంద్రం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎల్‌డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలకు పచ్చదనం, పరిశుభ్రతకు గ్రామపంచాయతీ, కార్యదర్శులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు అనారోగ్యం పాలవకుండా డ్రైనేజీలు ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తూ చెత్త పేరుకుపోకుండా పొడి, తడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి ఎరువుగా తయారు చేయాలని దీనివల్ల సంపద సృష్టించవచ్చన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని గ్రామాలభివృద్ధికి పరిసరాల పరిశుభ్రతతో అధికారులు, గ్రామసర్పంచ్‌లు కృషిచేయాలన్నారు.ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, గ్రామసర్పంచ్ కడిమి వీరకుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, పంచాయతీ కార్యదర్శులు ఎన్.రవికిషోర్, డీఎల్‌పీఓ వై.రాజారావు, ఏ.అమ్మిరాజు, రామచంద్రరావు, టీడీపీ నాయకులు నున్నా నాగేశ్వర రావు, కడిమి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐషర్ వ్యాన్ ఢీకొని ఒకరి అక్కడికక్కడే మృతి



ఘటనాస్థలిలో రవి మృతదేహం

దేవరపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను ఎదురుగా ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన గౌరీపట్నం శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు పల్లంట్లకి చెందిన గొల్లిపల్లి రవి (37) గౌరీపట్నం నుంచి దేవరపల్లి వైపు వస్తుండగా రాజమండ్రి వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను వేగంగా వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రవి గౌరీపట్నంలోని శ్రీసాయి స్టోన్ క్రషర్స్‌లో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన స్నేహితుడు గౌరీపట్నంలో టీ తాగటానికి రమ్మని ఫోన్ చేయడంతో వెళ్లి వస్తుండగా ఐషర్ వ్యాన్ ఢీకొంది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య గొల్లిపల్లి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పంగిడికి చెందిన కొండేటి చంద్రం (60) ఈ నెల 10వ తేదీన ఆస్తి విషయమై కుటుంబసభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇంట్లో గొడవ పడి న ప్రతిసారి ఇలాగే వెళ్లిపోయి వారం రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. అయితే ఈ సారి 10 రోజులైనా రాకపోవడంతో భార్య కొండేటి దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఆర్ఐ ప్రభాకరరావు ఉదారత

● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనాలు, బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రభాకరరావు కుటుంబ సభ్యులు

నల్లజర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లికి చెందిన ఎన్ఆర్ఐ గద్దే ప్రభాకరరావు తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు ఏర్పాటు చేస్తూ ఉదారతను చాటుకున్నారు. అనంతరం వారికి బహుమతులు అందించారు. అలాగే ప్రతి ఏటా పదోతరగతిలో ప్రతిభ సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.2500, రూ. 1500, రూ.1000, అలాగే ఏడోతరగతిలో ప్రతిభ సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.1500, రూ. 1000, రూ.500 అందిస్తున్నారు. ప్రతి ఏటా ప్రభాకరావు ఒక్కరే వచ్చి స్కూల్ విద్యార్థులతో గడిపేవారు. కాగా, ఈ ఏడాది ఆయన భార్య రమణి, ఇద్దరు కూతుళ్ల విజయ, కవిత, అల్లుడు రాంసీ (అమెరికా వాసి) మనవడు రుమిహాం సనీ, మనమరాలు లీలా అన్నపూర్ణ వచ్చారు. దీనిలో భాగంగా ఇక్కడి విద్యార్థులతో కొద్దిసేపు గడిపారు. తర్వాత 150 మంది విద్యార్థులకు వారు తీసుకుకొచ్చిన భోజన స్టీల్ ప్లేట్లు, వాటర్ ప్లాస్క్, మూడు నోట్‌బుక్స్, చికెన్ బిర్యానీ అందజేశారు. వారివెంట మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, దాసు రాజా బ్రదర్స్, వల్లిరెడ్డి సతీష్, గెద్దాపు సూర్యనారాయణ, మరో ఎన్ఆర్ఐ గన్నమని భాను కిరణ్ ఉన్నారు. ఇదే పాఠశాలను ప్రభాకరావు తండ్రి అప్పారావు సర్పంచ్‌గా ఉన్నప్పుడు (పెంకుటిల్లు) నిర్మించారు. కాలక్రమంలో ఇప్పుడవి భవనాలుగా రూపాంతరం చెందాయి. ఇదే గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్‌లో రూ. లక్షా 50 వేలతో సైకిల్‌షెడ్డు, మరో రూ.లక్షతో మంచినీటి ట్యాంకు నిర్మించారు.